Andhra Jyothi  Dt- 18/03/14

# ఎల్అండ్‌టీ మెట్రో దూకుడుకు హెచ్ఎంఆర్ కళ్లెం

## మెట్రో స్టేషన్లకు ప్రైవేటు పేర్లకు నో

## ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన హెచ్ఎంఆర్ ఎండీ



ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ : మెట్రో ప్రాజెక్ట్‌పై అంతా తానై వ్యవహరిస్తున్న ఎల్ అండ్ టీ మెట్రోరైలు లిమిటెడ్ (ఎల్ఎంఆర్ఎల్) దూకుడుకు హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) కళ్లెం వేసింది. ముందస్తు అనుమతులు లేకుండా ప్రాజెక్టులోని అంశాలపై ఏక పక్ష నిర్ణయాలు తీసుకోకూడదని ఇంజనీర్లకు స్పష్టం చేసింది. 'మెట్రో స్టేషన్లకు ప్రైవేటు పేర్లు'.. ఇందుకు భారీగా ఫీజు వసూళ్లు శీర్షికన ఆంధ్రజ్యోతి సోమవారం ప్రచురించిన కథనంపై హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పందించారు. స్టేషన్లు, కారిడార్ల పేర్లను ప్రైవేటు పరం చేయడానికి, ఎల్అండ్‌టీ మెట్రోకు తామెటువంటి అనుమతులూ ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఆ సంస్థ ప్రతినిధులు ఓ సందర్భంలో దీనికి సంబంధిత ప్రతిపాదనలను మాత్రమే తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఒప్పందంలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని న్యాయ నిపుణుల సలహాల మేరకు ప్రభుత్వం దీనిపై నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేయాల్సి ఉందని వివరించారు. అంతలోనే తొందరపడి ఎల్అండ్‌టీ మెట్రో వెబ్‌సైట్‌లో ఈ విధానాలను మార్కెట్ చేసిందన్నారు. దీనికి సంబంధించిన ముందస్తు అనుమతులేవీ ఎల్అండ్‌టీ మెట్రో వర్గాలు తమ వద్ద తీసుకోలేదని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. దీనిపై సదరు సంస్థను వివరణ అడుగుతామని తెలిపారు.

### అదీ జీహెచ్ఎంసీకి లోబడే...

ఒప్పందం ప్రకారం మెట్రో మాల్స్, స్టేషన్లలో ఏర్పాటు చేసే వాణిజ్య సముదాయాలకు సంబంధించి స్పేస్ బుకింగ్ చేసుకోవడానికి వారికి అధికారం ఉందని ఎన్వీఎస్ వెల్లడించారు. పిల్లర్లు, వయాడక్ట్, మెట్రో కోచ్ లోపల, బయట ప్రకటనల సంస్థలకు హక్కులు కల్పించే అధికారం వీరికి ఉందన్నారు. కాకపోతే జీహెచ్ఎంసీ నిర్దేశించిన ప్రమాణాలు, ఫీజులకు ఇవి లోబడి ఉంటాయని పునరుద్ఘాటించారు.